


కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ మిథున్‌రెడ్డి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు: ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో జాతీయ రహదారుల పలు రోడ్ల నిర్మాణ పనులకు అనుమతులు కోరుతూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కేంద్ర రహదారులు, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మదనపల్లి బైపాస్ రోడ్డు, కడప-రేణిగుంట రోడ్, పుంగనూరు-పులిచెర్ల-చిన్నగొట్టిగల్లు రోడ్డు అప్‌గ్రేడ్, పీలేరు మండలం, దొడ్డిపల్లె క్రాస్ సర్వీస్ రోడ్డు అవసరాల గురించి మంత్రితో చర్చించి, సత్వర చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలియజేశారు. ఇందుకు మంత్రి కూడా ఎప్పటిలాగే సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కడప, తిరుపతి పార్లమెంట్ సభ్యులు అవినాష్‌రెడ్డి, డాక్టర్ గురుమూర్తి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కలికిరి

జిల్లాలో భూ సమస్యలు లేకుండా చేయడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య లక్ష్యమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం మండలం పారపట్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తహశీల్దార్ మహేశ్వరిబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా చేసేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులో తహశీల్దార్, వీఆర్‌ఒ, సర్వేయర్, ఎండోమెంట్స్, అటవీ, తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. పారపట్ల గ్రామానికి సంబంధించి మొత్తం 28 భూ సమస్యలు వచ్చాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. వెంటనే పరిష్కారం అయ్యే సమస్యలకు సదస్సు జరిగిన రోజే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. కొన్ని సమస్యలకు నోటీసు ఇచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరికొన్ని సమస్యలను కుటుంబ సభ్యులే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. పారపట్ల గ్రామంలో రిసర్వే పూర్తయిందని, రి సర్వే అనంతరం కొంతమంది రైతుల భూమి తక్కువగా నమోదయిందని అర్జీ సమర్పించారని అటువంటి సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించబడతాయని, ఏ గ్రామంలో అయితే సదస్సు నిర్వహించబడుతుందో ఆ గ్రామ ప్రజలు రెవెన్యూ సదస్సును వినియోగించుకొని తమ భూ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కారం చేయడమే కాకుండా రెవెన్యూ సేవలను ఉచితంగా అందిస్తున్నామని, వాటిని కూడా సదస్సు జరిగే రోజు వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

60 ఎకరాలకు దారి సమస్యకు పరిష్కారం : పారపట్ల గ్రామానికి చెందిన 20 మంది రైతులకు సంబంధించిన 60 ఎకరాలకు దారి సమస్య ఉందని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ విన్నవించగా దారికి అవసరమైన భూమిని చట్టబద్ధంగా భూసేకరణ చేసేందుకు నివేదికను వెంటనే సమర్పించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. గ్రామానికి చెందిన కొంతమంది రైతు వ్యవసాయ భూములకు వెళ్లే దారికి అడ్డంగా అక్రమంగా నిర్మించిన గేటును కలెక్టర్ స్వయంగా పరిశీలించి, వెంటనే తొలగించాలని తహశీల్దార్, పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం సదస్సు కార్యక్రమం పూర్తయిన తర్వాత రాయవోటికి వచ్చే దారిలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను కలెక్టర్ గుర్తించారు. ఇసుకను అక్రమంగా తరలించిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, మండల ప్రత్యేక అధికారి జయప్రకాష్, ఎంపిడిఒ భానుమూర్తి రావు, సర్వేయర్ రెడ్డప్ప, మండల రెవిన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గురువుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గిరిజన పాఠశాలల్లోని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా చేయాలని కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేనిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన దీక్షల్లో కూర్చున్న ఉపాధ్యాయులకు పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలల్లో పది సంవత్సరాల నుండి విద్యార్థుల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ వ్యవహరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా 33 రోజుల నుండి చేస్తున్న సమ్మె డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని వీరి స్థానంలో డిఎస్‌సి నియామకాలను మినహాయించాలని కోరారు. సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరికృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు సి.మురళీమోహన్ రాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం రాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ సాధారణంగా చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాల్లో డిఎస్‌సి నియామకాలు చేపడతారని, అవుట్ సోర్స్ పద్ధతిలో పని చేసే వారిని తొలగించి వారిని డిమోషన్ చేసి పార్ట్ టైం టీచర్స్‌గా మార్చే సంస్కృతి, విద్యావ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని కాంట్రాక్టు టీచర్స్‌గా ప్రమోట్ చేయాలని కోరారు. ఉధృతమైన పోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచి సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఉద్యోగ భద్రత కోసం మీరు చేస్తున్న పోరాటలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయులు శ్రీనివాసులు నాయక్, సరోజ, హరిత, మహదేవ్ విజయకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గీత, సుధాకర్ సుమతి, ప్రకాష్, వనిత, త్రివేణి, కల్పన, సుహాషిణి చందన, సుజాత, లావణ్య, సిఐటియు నాయకులు రామాంజులరెడ్డి, మాధవయ్య, తదితర జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో పిఅండ్‌టి కాలనీ, సొసైటీ కాలనీలో సిమెంట్ రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణానికి మునిసిపల్ చైర్‌పర్సన్ మనుజాతో కలసి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజల రాకపోకలకు రోడ్లు సౌకర్యవంతంగా ఉండాలన్న ఆశయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంతోపాటు శివారు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణం పెద్దఎత్తున చేపట్టామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడం కోసం టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో పారిశుధ్య విభాగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్ది ప్రజారోగ్యాన్ని కాపాడే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మనుజ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించ డానికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ కాలనీ, పిఅండ్‌టి కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అన్ని వార్డులలోను అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రమీల, నాయకులు రాధమ్మ, పులి మహాలక్ష్మి, బెల్లె రెడ్డి ప్రసాద్, నాగార్జున బాబు, సందీప్, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, సంగం శ్రీనివాసులు, బీదం గురునాథ్ యాదవ్, జెసిబి వేణు, మంజునాథ్, బవిజయమ్మ, స్థానిక వార్డు ప్రజలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాల్లో వైవీయూ మెరుగైన పనితీరు

- ఐఎస్‌ఒ ప్రతినిధుల బృందం సంతృప్తి
- అభివృద్ధికి వైవీయూకు పలు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న సిఇఒ శివయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనపర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్‌ఒ) ప్రతినిధి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సిఇఒ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐఎస్‌ఒ ప్రతినిధుల బృందం సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఎసి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఇఒ శివయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. బోధన, పరిశోధనలు, పరిసరాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. శాఖల వారీగా ఐదు వరకు గ్రేడులు ఇచ్చారని, అక్కడక్కడ రికార్డుల నిర్వహణ మెరుగు కావలసి ఉందన్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన ఆధారం ఫైలింగ్ చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు పాటించాలన్నారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడును వైవీయూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ఆడిటర్ టి.సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఎస్‌ఒ ప్రతినిధుల బృందం విశ్వవిద్యాలయానికి సంబంధించి వాస్తవ నివేదికను ఇచ్చిందని, వారి సూచనలు పాటించి అభివృద్ధి దిశగా ముందుకు వెళతామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ ఫైల్ మేనేజ్మెంట్‌పై బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి డాక్యుమెంటేషన్‌కు ఇకపై ఆధారాలు ఉండేలా చూస్తామన్నారు. రెండు రోజుల బృందం పరిశీలనలో సమన్వయం చేసిన ఐక్యూఎసి సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఐఎస్‌ఒ ప్రతినిధులకు, వైవీయూ అధ్యాపకులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఐక్యూఎసి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్ చంద్ర, సభ్యులు ఆచార్య రియాజున్నిసా, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ టి.శ్యామ్ స్వరూప్, డాక్టర్ దాక్షాయని, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న కమిషనర్ వాసుబాబు

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-రాయచోటి

మున్సిపాలిటీ పరిధిలో ఎగువ అబ్బవరం దళితవాడలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం తాగునీటి బోరు డ్రిల్లింగ్ చేపట్టారు. రెండు ఇంచులకు పైగా నీళ్లు పడ్డాయి. మంత్రి ఆదేశాల మేరకు బుధవారం బోరుకు మోటారు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమీషనర్ వాసు,అర్చన విద్యాసంస్థల కరెస్పాండెంట్ మదన మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 24 గంటల్లోనే బోరు ప్రారంభించి, మోటార్‌ను కూడా ఏర్పాటు చేసి, తాగునీటిని అందివ్వడం హర్షణీయమని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇ సుధాకర్ నాయక్, ఎఇ మునీంద్ర, కిరీటి, వర్క్ ఇన్స్‌పెక్టర్ సుదర్శన్, మాజీ కౌన్సిలర్ రామయ్య, పెద్దిరెడ్డి, రామకృష్ణ , రాజేంద్ర, రమణ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి : 'చొప్పా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం బి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులకు ఇనాగరేషన్, ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఎల్లారెడ్డి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థిపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, ఆ ఆశలను నెరవేర్చే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని, అన్నారు. మొదటి రోజు నుంచి పట్టుదల, కృషితో విద్యన భ్యసించి తల్లిదండ్రులకు గొప్ప కీర్తిని తీసుకురావాలని తెలిపారు. కళాశాల ఐక్యు ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ద్వారకనాథ్ రెడ్డి ఔషధ తయారీ విద్య గొప్పతనాన్ని, విద్యలో ఉండే అవకాశాలను, ఉద్యోగ కల్పన గురించి వివరించారు. డాక్టర్ కె.ఆది నారాయణ, గిరీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నాలుగు సంవత్సరాల బి.ఫార్మసీ విద్యలో, ఆరేళ్ల ఫార్మా డి విద్యలో ఎలా మలుచుకోవాలో తెలిపారు.

నోపార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపొద్దు

ప్రజాశక్తి రాయచోటి

పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ట్రాఫిక్ సిఐ విశ్వనాధ రెడ్డి తన సిబ్బంది తో కలసి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసిన వారికి జరిమానాను విధించారు. పట్టణంలోని ఆపోజిట్ మార్గంలో వాహ నాలు నడుపుతున్న వారిని ఆపి అలా రాంగ్ డైరెక్షన్‌లో వాహనాలు నడుపుట వలన కలిగే అనర్థాల గురించి వాహనదారులకు వివరించారు.



రహదారిపై వాహనాలను పరిశీలిస్తున్న సిఐ

జిల్లా స్థాయి వినియోగదారుల దినోత్సవ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 22న ఉదయం 10 గంటలకు డైట్ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 'వినియోగదారులు న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశం మీద వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించబడతాయని అన్నారు. జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందిస్తారని అన్నారు. జిల్లా స్థాయిలో మెదటి స్థానం సాధించిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనవలసి ఉంటుందిన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులున్నారు. విద్యార్థులు అదనపు సమాచారం కోసం డైట్ అధ్యాపకులు ఎం. శివ భాస్కర్ 9441328448, కె. శ్రీదేవి 7989189220, అసదుల్లా 9440084715ను సంప్రదించవచ్చు అని తెలిపారు.

రేపు డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్‌ఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ఆర్‌టిసి సమస్యలపై ఈ నెల 20న డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రజలు 9959225848 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. వాట్సాప్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఎంబిఎ విద్యార్థులకు సెమినార్

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని కందుల స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ అండ్ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో బుధవారం ఎంబిఎ విద్యార్థులకు కార్పొరేట్ క్యాయిన్ కెరియర్ గ్రోత్ ఇంటర్న్‌షిప్, లీడర్‌షిప్ క్వాలిటిస్ అనే పాపిక్ మీద స్పీకర్ ఎం.దిలీప్ సెమినార్ నిర్వహించారు. మెళకువలగురించి వివరించారు. సీనియర్ శిక్షకులు రాయపాటి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌కు కావాల్సిన మేనేజింగ్ స్కిల్స్ తెలిపారు. కాలేజీ నుంచి కార్పొరేట్ సమాజంలోకి మారడం ఒక సవాల్ అని చెప్పారు. సరైన మార్గదర్శకత్వం ఉంటే సులభమన్నారు. కార్యక్రమంలో కెఎస్‌ఆర్‌ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి, డాక్టర్ రత్నమ్మ, రమణ, సిద్ధిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిజిహెచ్ అభివృద్ధి అందరి బాధ్యత

- వైద్య విభాగాధిపతుల సమావేశంలో కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్య విభాగాధిపతులకు సూచించారు. బుధవారం రిమ్స్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సెమినార్ హాలులో వైద్య విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్ జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యుత్తమ టీచింగ్ హాస్పిటల్‌గా పేరు గడించిందన్నారు. మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలు ప్రతి నిత్యం ప్రాణరక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, అధునాతన సదుపాయాలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. మరో ఐదారు నెలల్లో అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా జిజిహెచ్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. వైద్యం కోసం వచ్చే ప్రతి పేషంట్ 100 శాతం కంప్లైంట్ సంతృప్తికరంగా తిరిగి ఇంటికి వెళ్లేలా వైద్యసేవలు అందించాలన్నారు. పేషంట్ల నుండి అందే ఫీడ్ బ్యాక్ ఆధారంగానే జిజిహెచ్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. పేషంట్‌కు వైద్యం అందించే విషయంలో ఎలాంటి కొరత రాకుండా ఆసుపత్రి యాజమాన్యం జాగ్రత్తలు వహించాలన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో అవసరమైన మందులను ప్రణాళికాబద్ధంగా నిల్వ ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను కూడా పటిష్టం చేయాలన్నారు. రక్తనిధి కేంద్రంలో అన్ని రకాల పేషంట్లకు అత్యవసరమైన అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిజిహెచ్‌లోని అన్ని విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను ఆయా వైద్య విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆయా విభాగాల్లో ఎలాంటి కొరత లేకుండా అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిజిహెచ్ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అవసరమైతే సీఎస్‌ఆర్ నిధుల ద్వారా కూడా మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, ఎపివివిసి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ హిమదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆర్‌ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్‌ఎంఒలు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీధర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శ్వేతా అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.



రిమ్స్ ఒపి విభాగంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఒపి, ఐపి బ్లాకుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జిజిహెచ్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒపి, ఐపి బ్లాకుల్లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి అక్కడి మౌలిక వసతులైన ఎక్యూప్మెంట్స్, సదుపాయాల గురించి హెచ్‌ఒడి, సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం వద్దకు వెళ్లి అక్కడి విభాగాలను పరిశీలించి సదుపాయలపై ఆరా తీశారు. ఎకో, టుడి స్కానింగ్ సెంటర్లతో పాటు కార్డియాలజీ, క్యాథల్యాబ్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, పోస్ట్ ఒపి, రికవరీ వార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. సైకియాట్రిక్ హాస్పిటల్స్ బ్లాకులను తనిఖీ చేసి సంబందిత ల్యాబులు, పరికరాలు, డీఆడిక్షన్ వార్డు, సదుపాయాలను, క్యాన్సర్ హాస్పిటల్ ఒపి, ఐపిలను పరిశీలించారు.



పీలేరులో స్కానింగ్ సెంటర్లను పరిశీలిస్తున్న డిప్ డాక్టర్ ఉషశ్రీ

తూతూ మంత్రంగా స్కానింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు : పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలపై డిప్ఇ డాక్టర్ ఉషశ్రీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను గుట్టుచప్పుడు కాకుండా చేపట్టినప్పటికీ అవకతవకలు లేవని అధికారులు ప్రకటించారు. అయితే, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పీలేరు వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ, ఆడబిడ్డగా నిర్ధారణ అయితే గర్భస్రావాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ గర్భస్రావాలకు భారీ మొత్తంలో వారి నుంచి డబ్బులు వసూళ్ళకు పాల్పడుతున్నారన్నది విశ్వసనీయ సమాచారం. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఎదురవుతున్నాయి. గర్భస్రావం ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు చట్టప్రకారం నేరమని, దీని వల్ల క్రిమినల్ చర్యలు తీసుకోబడుతుందని అధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం అవసరం. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటేనే ఈ దుర్వినియోగం అరికట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇంటి, నీటి పన్ను సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి - బి.కొత్తకోట: ఇంటి పన్ను, నీటి పన్ను సకాలం చెలించాలని నగర పంచాయతీ కమిషనర్ జి.వి.పల్లవి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో నివాసమున్న ప్రజలు నగర పంచాయతీ కార్యాలయానికి విచ్చేసి వారి ఆస్తి పన్నులు చెల్లించి ఆన్‌లైన్ రసీదును పొందాలన్నారు. పన్నులు, నీటి పన్నులు, బకాయిలు సకాలంలో చెల్లించి నగర పంచాయతీ అభి ృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

మైనార్టీలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత అన్నారు. బుధవారం మైనార్టీల హక్కుల దినోత్సవం సందర్భంగా నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయ వాదులచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతద శంలోని మైనారిటీ వర్గాల హక్కులను ప్రోత్సహించడానికి ప్రతి సంవ త్సరం డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు అని తెలిపారు. ప్రస్తుత మైనారిటీల శాతం దేశంలోని మొత్తం జనాభాలో 19.3 శాతం ఉందన్నారు. భారతదేశంలో మైనారిటీల హక్కుల దినోత్సవం 2024 థీమ్ "వైవిధ్యాన్ని ప్రోత్సహించడం మరియు హక్కులను రక్షించడం" అని తెలిపారు. మైనారిటీల హక్కుల దినోత్సవం స్వేచ్ఛ, సమాన అవకాశాలను మైనారిటీలకు అలాగే ఆ హక్కులపై అవగాహన పెంచుకోవడం అని అన్నారు. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, జొరాస్ట్రియన్‌లు (పార్సీలు) నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్ చట్టం, 1992లోని సెక్షన్ 2 (సి) ప్రకారం మైనారిటీ కమ్యూనిటీలుగా ప్రకటించబడ్డారు అని అన్నారు. రాజ్యాంగ హక్కులను గురించి వివరిస్తూ ఆర్టికల్ 14, 15, 16, 25, 26, 27, 28, 39, 30, ఆర్టికల్ ఆర్టికల్ 350 బి ల గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 151000 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి డిప్యూటీ సిఇఒ మైథిలి

పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలి : డిప్యూటీ సిఇఒ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో అన్ని గ్రామాలను పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని కడప జడ్‌పి డిప్యూటీ సిఇఒ మైథిలి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సభ భవనంలో బుధవారం గ్రామాల అభివృద్ధి పైన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి అధికారులు దృష్టి సాధించాలన్నారు. గ్రామాల్లో నిరుపేదలు లేకుండా స్వయం సహాయక సంఘాల ద్వారా చిన్న చిన్న కుటీర పరిశ్రమలకు ప్రోత్సహించాలని చెప్పారు. గ్రామాల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళలపై జరుగు అత్యాచారాలు నివారించడానికి దృష్టి సాధించాలన్నారు. మహిళలలో నిరక్షరాశులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జాషువా, ఎఒ చాంద్ బాషా, విఆర్‌ఒ లు, పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో కలామ్స్ విజన్ సైంటిఫికల్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీలలో రాయచోటి సందీప్ హై స్కూల్‌లో నిర్వహించే కలామ్స్ విజన్ 2024 సైంటిఫికల్ ప్రాజెక్టు ఎక్స్‌పోను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవడానికి సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఎంతో ఉపయో గపడుతుంది అన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరూ తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని అన్నారు. ప్రాజెక్టు రూపొందించిన ప్రతి విద్యార్థికి ప్రశంస పత్రం , జ్ఞాపికలు అందిస్తారని అన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం6281453550, 9391932752 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు, ప్రిన్సిల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

క్రిస్మస్,నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాల, సెయింట్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు, ఆర్‌సిఎం చర్చి విచారణ పరిధిలోని పేద వృద్ధులకు పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో 430 మందికి దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా తోమాస్‌రెడ్డి సహకారంతో సంస్థల ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు, వృద్ధులకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు, నిరుపేద వృద్ధులు పండుగలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో వారికి దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్. చిన్నప్ప, రెవరెండ్ ఫాదర్ సురేష్, కస్తూరిబా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పుష్పలత హాజరయ్యారు. గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు, వృద్ధులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నాణ్యమైన ఆహారాన్ని అందించండి : మంత్రి

ప్రజాశక్తి-సంబేపల్లి(రాయచోటి)

సంబేపల్లి మండలం మోటకట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎం గ్రాండ్ రెస్టారెంట్, బ్యాన్ క్యూట్ హోటల్‌ను రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబేపల్లి మండలంలో ప్రజలకు అందుబాటులో రెస్టారెంట్,హోటల్‌ను ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. పెద్దపెద్ద పట్టణాలలో ఉండే రెస్టారెంట్‌లో మండలంలో ఏర్పాటు చేయడం అభినందనీయని అన్నారు. హోటల్‌కు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించి, దిన దినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రిని హోటల్ నిర్వాహకులు గజమాలతో ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రెస్టారెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని సబ్ ట్రెజరీ సమావేశపు హాల్లులో బుధవారం రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. స్థానికులు శ్మశాన వాటికకు భూమి కేటాయించాలని తహశీల్దార్ హరికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్మశాన వాటికకు భూమి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం : డిఎఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ బుధశారం మండల పరిధిలోని రాజుగారిపల్లె గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా రాగి, జొన్నలు, కొర్రలు పండించాలని పేర్కొన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందిన రైతులందరికీ కూడా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్త సందీప్ నాయక్ మాట్లాడుతూ ఆకుతోటలు, మామిడి, పూల, అరటి తోటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్యలను రైతులకు వివరించారు. రాజుగారిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకర్ రెడ్డి, హరి, పెంచల్ రెడ్డివారి పూల తోటలను సందర్శించి వాటిలో వచ్చిన తెగుళ్లను, మచ్చలను ఎలా నివారించుకోవాలో రైతులకు తెలిపారు. పశు వైద్యశాఖ అధికారి మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధికి టీకాలు, ఇటీవల కాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేయించడం జరిగిందని తెలిపారు. ఎడిఎ కవిత, ఎఒ శ్రీకర్ మాట్లాడుతూ ఇ-పంట నమోదు ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ప్రతి రైతు కూడా ఇ-పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఇన్‌ఛార్జి పి. మస్తాన్ మాట్లాడుతూ మహిళ రైతులకు, రైతులకు ద్రవ జీవామృతం డెమో చేసి దాని ప్రాముఖ్యత గురించి తెఇయజేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, లోకేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, రెడ్డి ప్రవీణ్, గాయత్రి, ఉదయభాను శాంతి కుమారి, రైతులు పాల్గొన్నారు. **రాయచోటి** :జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరూ ఇ-పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని రెసిడెన్సీలో ఐదు రోజులు జరిగే శిక్షణ తరగతులు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. జిల్లాలోని 30 మండల నుంచి 50 మంది కేడర్‌లను మొత్తం 8 బ్యాచ్‌లుగా నిర్ణయించి నాలుగవ బ్యాచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో వున్న విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటి యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసిఆర్ పి, డిపిఎంలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డిఎఒ

బాల్య వివాహాలను నిర్మూలించాలి : సిడిపిఒ



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సుజాత

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ మదనపల్లి ప్రాజెక్టు సిడిపిఒ సుజాత అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, డాక్టర్ ప్రత్యూష, ఎంఇఒ నారాయణ, సిహెచ్‌ఒ ఇందుమతి, పోలీస్ అధికారి చక్రవర్తిలతో కలిసి కిశోరి వికాసం కార్యక్ర మంపై అంగన్వాడీ కార్యకర్తలకు, సచివాలయ ఉద్యోగులకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం, ప్రజా ఆరోగ్యం కోసం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభు త్వం ప్రత్యేక కార్యక్రమాన్ని కిశోరి వికాసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న యుక్త వయసులోని బాల బాలికలు అనేక విధాలుగా వివిధ వాటిపై ఆకర్షితులు అవుతుంటారన్నారు. అటువంటి వారిలో ఆలోచన, విచక్షణ జ్ఞానం ఉన్నత స్థితిలో పరిపక్వత చెంది ఉండదన్నారు. చిన్నతనంలోనే వివాహాలు చేయ డం ద్వారా వారి జీవితంలో అనేక సమస్యలు ఏర్పడడం జరుగుతుందన్నారు. కుటుంబ బాధ్యత, విలువ లు తెలియని వయసులో వివాహాలు చేయడం ద్వారా అది కొద్ది సమయంలోనే విడాకులతో వారి జీవితాలు చిన్నాభిన్న మవుతున్నాయని అన్నారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా, పోలీసు శాఖ ద్వారా బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చేదిద్దడానికి అందరూ బాధ్యత వహించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ భాను లక్ష్మీదేవి, కానిస్టేబుల్ చక్రవర్తి, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె** : తంబళ్లపల్లి ప్రాజెక్టు పరిధిలోని సిడిపిఒ నాగవేణి ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యక్రమంలో కిశోరి వికాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు, ఎఎన్‌ఎం లకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, కిషోర్ వికాసం, బాల్య వివాహాలు,లింగ వివక్షత, అక్షరాస్యత,బాలిక విద్య,వ్యక్తిగత రక్షణ,లింగ సమానత్వం, బాల్యవివాహాలను అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి, ఎంఇఒ త్యాగరాజు, ఎపిఒ అంజనప్ప, ఎంపిహెచ్‌ఒ రమణ, సూపర్వైజర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె** : తంబళ్లపల్లి ప్రాజెక్టు పరిధిలోని సిడిపిఒ నాగవేణి ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యక్రమంలో కిశోరి వికాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు, ఎఎన్‌ఎం లకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, కిషోర్ వికాసం, బాల్య వివాహాలు, లింగ వివక్షత, అక్షరాస్యత,బాలిక విద్య,వ్యక్తిగత రక్షణ,లింగ సమానత్వం, బాల్యవివాహాలను అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి, ఎంఇఒ త్యాగరాజు, ఎపిఒ అంజనప్ప, ఎంపిహెచ్‌ఒ రమణ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ జీవన్ గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. ఎస్పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని బీరంగి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఘర్షణలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. మహిళలు, బాలబాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎటువంటి శిక్షలు పడతాయో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాగాళ్ల చేతిలో మోసపోతే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. చిన్న సమస్యలు, పరిష్కారాలు, ఆర్థిక మోసాలు, ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీరంగి గ్రామ ప్రజలకు మాట్లాడుతున్న సిఐ జీవన్ గంగనాథ్‌బాబు

వంద శాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలి : డిఇఒ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యాశాఖ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా డిఇఒ సుబ్రహ్మణ్యం బుధవారం మండలంలోని బీరంగి జడ్‌పి హైస్కూల్‌ను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల కార్యక్రమం - విద్యార్థుల సన్నద్ధత గూర్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునుస్వామి, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా వంద రోజుల కార్యక్రమాన్ని అమలు పరచాలని , వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు .వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక వ్యక్తిగతశ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను చక్కగా అవగాహన చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో..

మండలంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి జీవశాస్త్రం పరీక్షలు తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు.పరీక్షల నిర్వహణ తీరు,ప్రత్యేక తరగతుల నిర్వహణ గూర్చి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డిఇఒ వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శీను నాయక్, పిటిఎం ఎంఇఒ నారాయణ, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గాలివీడు

రైతులు ప్రజలు గ్రామాల వారీగా ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ఆర్‌డిఒ ఎం.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొరాన్ చెరువు గ్రామ సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ఏమైనా భూ సమస్యలుంటే ఆయా రెవిన్యూ గ్రామ సచివాల వద్ద జరిగే రెవెన్యూ సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజల నుంచి భూ సమస్యల వినతులకు 45 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రఘురాం, తహశీల్దార్ జె.భాగ్యలత, ఆర్‌ఐ బాలాజీ సర్వేర్ హేమనాథ, విఆర్‌ఒరవీంద్రారెడ్డి, విఆర్‌ఎలు కుమార్, షేర్‌అలీ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి కోరారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, విఆర్‌ఒలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి గ్రామపంచాయతీ మంచి ర్యాంకుతో పంచాయితీ డెవలప్మెంట్ ఇండెక్స్ అభివృద్ధి చెందాలని తెలిపారు. **రామపురం** : ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులపై డ్వామా పీడీ వెంకటరత్నం సమీక్ష నిర్వహించారు. మండలంలోని స్త్రీ శక్తి భవన్‌లో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై చర్చించారు. అనంతరం నల్లగుట్టపల్లి పంచాయతీలో కెజిబివి స్కూల్‌కు వేసిన సిమెంట్ రోడ్డును శుద్ధమల్ల పంచాయతీలో చేపట్టిన క్యాటిల్ షెడ్ ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఇసి శివయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ** : మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న స్థానికేతర సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలు భాగంగా రెండు రోజులపాటు జరుగుతున్న శిక్షణ తరగతులను జిల్లా అధికారి డిఎల్‌డిఒ లక్ష్మీపతి పరిశీలించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. ఈ శిక్షణ తరగతుల వల్ల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రామాలలో తాగునీరు సిసి రోడ్లు, విధి దీపాలు , మురుగు కాలువల శుభ్రత వంటి అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగోన్నతులు హర్షణీయం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం నుంచి తపాలశాఖ బ్రాంచ్ మాస్టర్‌గా పనిచేస్తూ పదోన్నతి పై ఢిల్లీ సర్కిల్‌కు మెయిన్ గార్డ్‌గా పదోన్నతి పొందడం హర్షణీయమని రాయచోటి పోస్టల్ ఇన్స్‌పెక్టర్ కె.అమర్నాథ్ పేర్కొన్నారు. బుధవారం గాలివీడు బ్రాంచ్ తపాలా కార్యాలయంలో పదోన్నతి పొందిన పాముల వెంకటేష్ గోవిందు, భాను ప్రకాష్, షేక్ రెడ్డి సాదిక్‌ను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. తపాల ఉద్యోగులందరూ వారిని సన్మానించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఎస్పిఇఎం దొరసామి నాయక్, పిఎ. రాఘవరెడ్డి, పిఎ గోపాల్ ఎంఒ హరి, కృష్ణానాయక్, ఏజెంట్లు యద్దయ్య, అలంవలి, పోస్ట్ మాస్టర్ భాషా, సిబ్బంది బుజ్జమ్మ, తపాల ఉద్యోగులు పాల్గొన్నారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందలూరు

ఈనెల22వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగబోయే ఉచిత మెగా సంతాన సాఫల్యత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అరిగే రాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాలలోని సంతానలేమితో బాధపడుతోన్న ప్రజలకు చక్కటి అవకాశమని అన్నారు. పిల్లలు ఎందుకు కలగడంలేదు, అందుకు గల కారణాలను విశ్లేషించి సంతానంలేమికి కారణమైన సవరించగలిగే లోపాలను సవరించి, సంతానం కలిగేలా చేసే వైద్యం ఇప్పుడు మండలంలోనే లభ్యమవుతుందన్నారు.



లక్ష్మీదేవికి ఆర్థిక సాయం అందిస్తున్న నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి

ఉపాధ్యాయుడి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని స్థానిక విక్టరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగేంద్ర కుమార్ గత పది రోజులుగా పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఆ ఉపాధ్యాయుడికి రూ. 1.05లు ఆర్థిక సాయం అందించినట్లు కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షవాతానికి గురైన నాగేంద్ర కుమార్ అమరరాజాకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారని, ఆర్థిక పరిస్థితి సరిగా లేనందువలన అతని చికిత్స నిమిత్తం పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, విద్యార్థులు కలసి బుధవారం ఆయన భార్య లక్ష్మీదేవికి నగదును అందించామని తెలిపారు. ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులు, ద్యార్థుల తల్లిదండ్రులకు లక్ష్మీదేవి ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయం చేశామని, ప్రార్థించే పెదవుల కన్నా-సాయం చేసే చేతుల మిన్న అనే నానుడిని నమ్ముకొని సహాయం చేస్తున్నామని వారు తెలిపారు.

సంఘమిత్ర తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

17వ సంఘమిత్రగా 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న లక్ష్మీ అనే మహిళను ఇటీవల తొలగించి ఆమె స్థానంలో మరొకరిని సంఘమిత్రగా నియమించడంతో బి.కొత్తకోట పట్టణానికి చెందిన సుమారు 100 మంది సంఘమిత్రలు, గ్రూపు సభ్యులు వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ర్యాలీగా బైపాస్ రోడ్డు నుంచి రంగసముద్రం రోడ్డు మీదుగా జ్యోతి చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ బి.కొత్తకోట ఎపిఎం, జిల్లాస్థాయి పీడీ అధికారులకు, కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని తెలిపారు. కలెక్టర్ స్పందించి పీడీకి తక్షణం సంఘమిత్ర లక్ష్మీని తీసుకోవాలని తెలిపి మరల ఈ మహిళ తిరిగి నా దగ్గరికి రాకూడదని ఆదేశించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి లక్ష్మీని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నేషనల్ బేస్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- రైల్వేకోడూరు



రైల్వేకోడూరు : విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు

నేషనల్ బేస్ బాల్ పోటీలకు ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థి మోసిన అరవింద్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎస్ఎన్.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేట లో జరిగిన స్టేట్ లెవెల్ 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్ బాల్ పోటీలలో ఎస్‌వి జూనియర్ కళాశాలకు చెందిన మోసిన అరవింద్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి జనవరి 13,14 తేదీలలో మహారాష్ట్రలో జరిగే నేషనల్ లెవల్ బేస్ బాల్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. నేషనల్ ఫెస్టివల్ కు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్ ఎస్ఎన్. శ్రీనివాసులు, డైరెక్టర్ వసుందర, పిఇటి పుల్లారావు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న చిన్నరసు పల్లెకు చెందిన ఎ.ఆంజనేయులుగారి కుమార్తె ఎ.వైష్ణవి, సిఇసి ఫస్ట్ ఇయర్ చదువుతున్న బోనమల కు చెందిన వై.మల్లికార్జుననాయుడుకుమారుడు వై.శ్రీహరినాయుడు అండర్-19 విభాగంలో బెస్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. వీరిద్దరూ కూడా గ్రామీణ ప్రాంతం నకు చెందిన వ్యవసాయ కుటుంబమునకు చెందిన వారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లి లో జరిగినటువంటి రాష్ట్రస్థాయి బెస్ బాల్ పోటీలకు తమ కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులను పంపించామని,వారిలో జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. వీరి ఎంపికకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ రామాంజనేయులును అభినందించారు.

క్రైం కార్నర్

కేసింగ్ పైపు ధ్వంసం

- 60 మీటర్ల కేబుల్ వైరు చోరీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కేసింగ్ పైపును ధ్వంసం చేసి 60 మీటర్ల కేబుల్ వైరు చోరీతో పాటు మరోచోట బోరు మోటర్‌ను బావిలో పడేసి వెళ్లిన సంఘటన మండలంలోని ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెకు చెందిన కృష్ణప్పగారి సహదేవ, కె.వెంకటరమణ లకు సంబంధించిన సర్వేనెంబర్ 72-బి లోని పొలంలో వ్యవసాయ బోరు వేసుకుని ఉన్నారు. ఇదే పొలంలోనే మరో నీటి బావి కూడా ఉందన్నారు. వ్యవసాయ బోరు, నీటి బావి ద్వారా నీటిని ఉపయోగిస్తూ ఇద్దరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల పొలంలోని నీటి బావికి, బోరుకు సంబంధించిన స్టార్టర్లు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పారు. మరోచోట మంగళవారం రాత్రి పొలం వద్ద ఎవరూ లేని సమయంలో వ్యవసాయ బోరు కేసింగ్ పగలగొట్టి, పైపులైన్ గేట్‌వాల్‌ను పగలగొట్టి, 60 మీటర్ల కేబుల్ వైర్‌ను దోచుకెళ్లారని అన్నారు. వ్యవసాయ బావి వద్ద అమర్చిన మోటార్‌ను కూడా బావిలోకి పడేశారని చెప్పారు. ఇటువంటి చోరీలకు, దుశ్చర్యలకు పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తులను పోలీసులు గుర్తించి తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీసు స్టేషన్ లో బాధితులు సహదేవ, వెంకటరమణ ఫిర్యాదు చేశారు. సంబంధించిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, దుండగులను పట్టుకోవాల్సి ఉంది.

తల్లీబిడ్డలపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లీ బిడ్డలపై ఇటుక రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయ పరచిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని చింతమాకులపల్లికి చెందిన శ్యామలమ్మ, ఆమె కుమారులు సోమశేఖర్, మనోహర్‌లు ట్రాక్టర్‌లో సమీప గ్రామానికి కూలి పనులకు వెళ్లారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి వస్తూ బీసీ కాలనీలో ఓ కుక్క కు ట్రాక్టర్ తగిలించారు. దీంతో కుక్క యజమాని నౌహీర్ అతని వర్గీయులు ఘర్షణ కు దిగి తల్లీ కుమారులపై ఇటుక రాళ్లతో మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన బాధితులను కుటుంబీకులు మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లి మండలం లో జరిగింది. ఎస్ఐ తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటరమణ, శివ, రవిలు ద్విచక్ర వాహనంలో నిమ్మనపల్లెకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని అర్థరాత్రి తిరిగి బైకులో ఇంటికి వెళ్తుండగా, పిట్టావాండ్లపల్లి వద్ద అడవిపిల్లి అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.